OPERATION SINDOOR

భారత భద్రతా దళాలు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌ను చూస్తే చాలా గర్వంగా ఉంది. ఎల్లవేళలా దేశం గర్వపడే విధంగా మన సైనికులు విరోచితంగా పోరాడుతూనే ఉన్నారు. భద్రతా బలగాల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయకుండా నకిలీ వార్తలు వ్యాప్తి చేయకుండా దేశ పౌరులుగా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరముంది. - రోహిత్‌శర్మ

దేశం కోసం పోరాడుతున్న భద్రతా బలగాలకు మనం అండగా నిలువాలి. క్లిష్టమైన పరిస్థితుల్లో వారు దేశాన్ని కాపాడుతున్నారు. ముష్కర మూకలతో తలపడుతూ దేశాన్ని సమున్నత స్థితిలో నిలిపేందుకు ప్రాణాలు వదులుతున్న సైనిక హీరోలకు వారి కుటుంబాలకు జీవితాంతం రుణపడి ఉంటాం. - విరాట్ కోహ్లీ

మన సైనికుల పోరాటతత్వం వెలకట్టలేనిది. మీ పోరాటం వల్లే మేము భద్రంగా ఉన్నాం. మన సరిహద్దులను కాపాడుతూ మీరు చేస్తున్న పోరాటానికి బిగ్ సెల్యూట్. మీకందరికీ ధన్యవాదాలు. జైహింద్. - సూర్యకుమార్‌యాదవ్

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సరిహద్దుల్లో పోరాడుతున్న భారత భద్రతా బలగాలను చూస్తే మనందరికీ చాలా గర్వంగా ఉంది. అందరి భద్రతను దృష్టిలో పెట్టుకుంటూ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిద్దాం. -నీరజ్ చోప్రా

వీరోచిత భారత భద్రతా బలగాలను చూస్తే గర్వంగా ఉంది. మీ ధైర్యం, క్రమశిక్షణ, త్యాగం దేశానికి ఆత్మలాంటివి. ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశ ఖ్యాతిని ఇనుమడింపజేస్తూ త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడిస్తున్నారు. మీ వెంట భారత్ ఉంది. జై హింద్' - పీవీ సింధు

కన్నుకు కన్ను సమాధానం కాదు

అంబటి రాయుడు ట్వీట్ ● నెటిజన్ల విమర్శల వర్షం

ముంబై: భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు వివాదాస్పద రీతిలో వార్తల్లోకెక్కాడు. భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ అసందర్భ ట్వీట్ చేశాడు. మహాత్మా గాంధీ మాటలను ఉదహరిస్తూ 'కన్నుకు కన్ను సమాధానమైతే ప్రపంచం గుడ్డిది అవుతుంది'అని రాయుడు తన ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. దీనిపై తీవ్ర స్థాయిలో నెటిజన్ల నుంచి విమర్శలు ఎదురయ్యాయి. 'అందుకే సెలెక్టర్లు నీపై శీతకన్ను వేస్తూ వన్డే ప్రపంచకప్‌నకు ఎంపిక చేయలేదు' అంటూ ఒక నెటిజన్ ఘాటుగా స్పందించాడు. అన్ని వైపులా నెటిజన్లు రాయుడుపై ఘాటైన ట్వీట్లు చేయడంతో వెంటనే సరిదిద్దుకునేందుకు ప్రయత్నించాడు. 'భారత సరిహద్దు రాష్ట్రాలైన జమ్ముకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్‌లో శాంతి నెలకొనాలని ఆశిస్తున్నా. పాక్ దాడులతో సమస్యలు ఎదుర్కొంటున్న వారు త్వరలో కోలుకోవాలి. జైహింద్' అంటూ రాయుడు మరో ట్వీట్ చేసి వివాదాన్ని సద్దుమణిగించే పనిలో పడ్డాడు.

పతకాల వేటలో ఆర్చర్లు

షాంఘై: ప్రపంచ ఆర్చరీ వరల్డ్‌కప్‌లో భారత ఆర్చర్లు పతకాల వేటలో మరో ముందడుగు వేశారు. రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ఇద్దరు ఆర్చర్లు సెమీస్ చేరగా కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత జట్టు కాంస్య పోరుకు అర్హత సాధించింది. పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగం క్వార్టర్స్‌లో పార్థ్ సలుంఖె.. 6-2తో కిమ్ జి డిఒక్ (దక్షిణ కొరియా)ను చిత్తుచేసి సెమీస్‌కు చేరాడు. తొలి రౌండ్‌లో పార్థ్.. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం, పారిస్‌లో కాంస్యం గెలిచిన మెటె గజోజ్ (టర్కీ)ను షూటాఫ్‌లో ఓడించి సంచలనం సృష్టించాడు. ఇదే విభాగంలోని మహిళల క్వార్టర్స్‌లో దీపికా కుమారి.. 6-2తో లి జియామెన్ (చైనా)ను ఓడించింది. మరో క్వార్టర్స్‌లో అతాను దాస్, అంకిత భక్త్ ఓటమిపాలయ్యారు.

'దేశం ఒకవైపు యుద్ధం చేస్తుంటే మీరు తాపీగా క్రికెట్ ఆడతారా?' అంటూ వెల్లువెత్తిన విమర్శలతో ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెట్ బోర్డుగా విరాజిల్లుతున్న బీసీసీఐ దిగొచ్చింది. ధర్మశాల మ్యాచ్ రద్దైనప్పటికీ లీగ్ యథాతథంగా కొనసాగుతుందని ప్రకటించిన బీసీసీఐ.. 18వ సీజన్‌ను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. దాయాదుల మధ్య కమ్ముకున్న యుద్ధ మేఘాలతో ఐపీఎల్-18ను వారం రోజుల పాటు వాయిదా వేసింది. దేశ ప్రయోజనాలు, ఆటగాళ్ల భద్రతకు పెద్దపీట వేస్తామన్న బీసీసీఐ.. లీగ్‌లో మిగిలిన మ్యాచ్‌ల నిర్వహణపై త్వరలోనే ప్రకటిస్తామని తెలిపింది.

వారం రోజులు పోస్ట్‌పోన్ చేసిన బీసీసీఐ
ఐపీఎల్ వాయిదా

భారత్, పాక్ ఉద్రిక్తతలతో కీలక నిర్ణయం ● సైన్యానికి పూర్తి మద్దతు ప్రకటించిన బోర్డు

ముంబై: భారత్, పాకిస్థాన్ మధ్య మొదలైన యుద్ధ సెగ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)నూ తాకింది. శుక్రవారం నుంచి వారం రోజుల పాటు ఈ లీగ్‌ను వాయిదా వేస్తున్నట్టు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రకటించింది. బాంబుల మోతతో సరిహద్దుల వద్ద ప్రజలు బిక్కుబిక్కుమంటుండగా దాయాది దేశంతో భారత సైనికులు వీరోచితంగా పోరాడుతున్న తరుణంలో ఐపీఎల్ నిర్వహణ సరికాదంటూ బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. గురువారం ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరగాల్సిన మ్యాచ్ అర్ధాంతరంగా రద్దైన వెంటనే లీగ్ కొనసాగింపుపై అనుమానాలు తలెత్తగా.. శుక్రవారం అత్యవసరంగా సమావేశమైన ఐపీఎల్ పాలకమండలి.. 18వ సీజన్‌ను వారం రోజుల పాటు వాయిదా వేస్తున్నట్టు వెల్లడించింది. వాయిదా నిర్ణయం తక్షణమే అమల్లోకి రావడంతో శుక్రవారం లక్నో వేదికగా జరగాల్సి ఉన్న లక్నో-బెంగళూరు మ్యాచ్‌ను నిర్వహించలేదు. ఈ మేరకు బీసీసీఐ స్పందిస్తూ.. 'ఐపీఎల్-18వ సీజన్‌ను వారం రోజులు వాయిదా వేస్తున్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో ఫ్రాంచైజీలు ఆటగాళ్ల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశాయి. బ్రాడ్‌కాస్టర్, స్పాన్సర్లు, అభిమానుల అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకున్నాకే ఈ నిర్ణయాని కొచ్చాం. ఈ క్లిష్ట పరిస్థితుల్లో బీసీసీఐ దేశానికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నది. మన సాయుధ బలగాల ధైర్యం, నిస్వార్థ సేవలకు సెల్యూట్ చేస్తున్నాం' అని ఓ ప్రకటనలో పేర్కొంది. ఇదే విషయమై బోర్డు ప్రతినిధి ఒకరు స్పందిస్తూ.. దేశంలో క్రికెట్‌కు విపరీతమైన ఆదరణ ఉన్నప్పటికీ తమకు దేశ ప్రయోజనాలు, ఆటగాళ్ల భద్రత అత్యంత ముఖ్యమని తెలిపారు. దేశం ఒకవైపు యుద్ధం చేస్తుంటే లీగ్ నిర్వహణ సరికాదని ఆయన స్పష్టం చేశారు. ఇక ఈ మెగా లీగ్‌ను ప్రస్తుతానికి వాయిదా వేసిన బీసీసీఐ.. మిగిలిన మ్యాచ్‌ల నిర్వహణ, షెడ్యూల్, వేదికలు, ఇతర వివరాలపై సమీక్షించి నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. మే 8 నాటికి ఐపీఎల్‌లో 58 మ్యాచ్‌లను నిర్వహించగా ఈ సీజన్‌లో మరో 12 లీగ్ మ్యాచ్‌లు, 4 నాకౌట్ మ్యాచ్‌లు మిగిలున్నాయి.

'వాయిదా' కొత్తేం కాదు

ఐపీఎల్ అర్ధాంతరంగా వాయిదా పడటం ఇదేం కొత్త కాదు. 2009, 2020, 2021లోనూ ఐపీఎల్ వాయిదా పడింది. 2009లో దేశంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆ సీజన్ మొత్తాన్ని దక్షిణాఫ్రికాలో ఆడించారు. 2020లో ప్రపంచాన్ని బెంబేలెత్తించిన కరోనా కారణంగా ఏప్రిల్-మేలో జరగాల్సిన లీగ్ కాస్తా సెప్టెంబర్‌కు వాయిదా (ఆ ఏడాది దుబాయ్‌లో నిర్వహించారు) పడింది. ఇక 2021లో బయో బబుల్‌లో ఐపీఎల్‌ను ఆడించినా సీజన్ మధ్యలో పలువురు ఆటగాళ్లు కోవిడ్ పాజిటివ్‌కు గురవడంతో ఉన్నఫళంగా సీజన్‌ను వాయిదా వేసి సెప్టెంబర్‌లో దుబాయ్‌లో నిర్వహించారు.

వారం తర్వాత సాధ్యమేనా..?

తాజా సీజన్‌ను ప్రస్తుతానికి వారం రోజుల పాటు వాయిదా వేసినప్పటికీ మిగిలిన మ్యాచ్‌ల నిర్వహణ ఇప్పుడైతే సాధ్యం కాదన్న వాదనే వినబడుతున్నది. షెడ్యూల్ ప్రకారం మే 25కు ఐపీఎల్ ముగియాల్సి ఉండగా తాజా వాయిదాతో దానిని జూన్ మొదటి వారానికి పొడిగించాల్సి వచ్చింది. కానీ జూన్ నుంచి అంతర్జాతీయ సిరీస్‌లకూ తెరలేవనుంది. జూన్ 11 నుంచి దక్షిణాఫ్రికా-ఆస్ట్రేలియా మధ్య వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ జరగాల్సి ఉండగా ఇరు దేశాల క్రికెటర్లలో చాలా మంది ఐపీఎల్‌లో వివిధ ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వాళ్లంతా అప్పటి దాకా వేచిఉండటం అనుమానమే. ఇంగ్లండ్ ప్లేయర్లలో పలువురు మే మూడో వారంలోనే లండన్ ఫ్లైట్ ఎక్కనున్నట్టు సమాచారం. మరో వైపు భారత జట్టు సైతం జూన్‌లోనే ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లాల్సి ఉంది. ఆగస్టు దాకా ఆ పర్యటన సాగనుంది. ఆగస్టులోనే ఇంగ్లండ్‌లో నిర్వహించే 'ది హండ్రెడ్' మొదలవుతుంది. ఈ నేపథ్యంలో ఐపీఎల్‌లో మిగిలిన మ్యాచ్‌లను సెప్టెంబర్‌లో నిర్వహించే అవకాశమున్నట్టు తెలుస్తున్నది. అదే సమయానికి భారత్ ఆసియా కప్‌నకు ఆతిథ్యమివ్వాల్సి ఉన్నా ప్రస్తుత పరిస్థితుల్లో పాకిస్థాన్, బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లు ఆడే అవకాశం లేకపోవడంతో ఆ టోర్నీని రద్దు చేసి (?) ఐపీఎల్‌ను నిర్వహించే అవకాశాలున్నట్టు బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

అదే బాటలో పీఎస్ఎల్

లాహోర్: ఐపీఎల్‌తో పాటు సమాంతరంగా పాకిస్థాన్‌లో జరుగుతున్న పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) సైతం వాయిదా పడింది. పాక్ ప్రధాని మహ్మద్ షెహబాజ్ ఆదేశాలతో తాము పీఎస్ఎల్‌ను వాయిదా వేస్తున్నట్టు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ప్రకటించింది. ఈ ప్రకటనకు ముందు పీఎస్ఎల్‌ను పాక్ నుంచి తరలించి దుబాయ్‌లో ఆడించనున్నారన్న వార్తలొచ్చాయి. కానీ భారత్‌తో సత్సంబంధాలున్న ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ).. పీసీబీ అభ్యర్థనను తోసిపుచ్చడంతో ఆ దేశానికి శృంగభంగమైంది. అయితే పీఎస్ఎల్‌ను ఎన్ని రోజులు వాయిదా వేస్తున్నారనే దానిపై మాత్రం స్పష్టత లేదు.

క్షేమంగా ఢిల్లీకి..

ఐపీఎల్ మ్యాచ్ ఆడేందుకు ధర్మశాలకు వెళ్లిన పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు, మ్యాచ్ సిబ్బంది, కామెంటేటర్లు శుక్రవారం రాత్రి క్షేమంగా ఢిల్లీకి తిరిగొచ్చారు. శుక్రవారం ఉదయం ధర్మశాల నుంచి కట్టుదిట్టమైన భద్రత నడుమ స్థానిక పోలీసులు సుమారు 40-50 చిన్న వాహనాల్లో వారిని పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌కు తరలించారు. అక్కడ్నుంచి బీసీసీఐ.. భారత రైల్వే ఏర్పాటు చేసిన ప్రత్యేక వందే భారత్ రైళ్లో వాళ్లను ఢిల్లీకి తీసుకొచ్చింది.

సిరిచందనకు కాంస్యం

● ఏషియన్ పవర్‌లిఫ్టింగ్ టోర్నీ

కొత్తపల్లి, మే 9 : డెహ్రాడూన్(ఉత్తరాఖండ్) వేదికగా జరుగుతున్న ఏషియన్ జూనియర్ పవర్‌లిఫ్టింగ్ టోర్నీలో తెలంగాణకు చెందిన తుడి సిరిచందన కాంస్య పతకంతో సత్తాచాటింది. శుక్రవారం జరిగిన మహిళల 52కిలోల విభాగంలో బరిలోకి దిగిన సిరిచందన 330కిలోల బరువు ఎత్తి మూడో స్థానంలో నిలిచింది. కరీంనగర్ జిల్లాకు చెందిన సిరిచందన అద్భుత ప్రదర్శతో కాంస్య పతకం సొంతం చేసుకున్నట్లు ఆమె కోచ్ మల్లేశం శుక్రవారం పేర్కొన్నాడు.

భరతమాత నుదిటిపై విజయ సిందూరం

దేశ సరిహద్దుల్లో క్షిపణుల శబ్దాలు హోరెత్తుతున్నాయి. శత్రుసైనికుల గుండెలు భయంతో తారెత్తుతున్నాయి. భారత జవాన్ల వీరోచిత పోరాట పటిమకు ఆసేతుహిమాచలం ప్రశంసలు మిన్నంటుతున్నాయి. దాయాదుల దాష్టికానికి బుల్లెట్లతోనే సక్రమమైన సమాధానమిస్తున్న భారత సైన్య పరాక్రమానికి వందకోట్ల భారతీయులు జేజేలు పలుకుతున్నారు. జై జవాన్ అంటూ నినదిస్తున్నారు. మరింత ధైర్యంగా ముందుకు సాగండి.. మీ వెంట మేమున్నామంటూ పోస్టులు పెడుతూ ఉత్తేజపరుస్తున్నారు. భారత సైనికులకు సెల్యూట్ చేస్తున్నారు. సినిమా సెలబ్రిటీలు సైతం మేమున్నామంటూ సోషల్ మీడియా ద్వారా భారత సైన్యానికి సంఘీభావం ప్రకటిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండండి.. విజయం మనదే-రాజమౌళి

ఆపరేషన్ సిందూర్'లో భారత సైన్యం ప్రదర్శిస్తున్న శౌర్యపరాక్రమాలను అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి కొనియాడారు. యుద్ధ సమాచారాన్ని పంచుకునే విషయంలో ప్రజలందరూ బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన ఎక్స్ (ట్విట్టర్)లో ఓ పోస్ట్ పెట్టారు. 'ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అలుపులేని పోరాటం చేస్తున్న సైనికులకు వందనాలు. సైనికుల ధైర్యసాహసాలతో స్ఫూర్తిపొందుతూ మనమంతా ఐక్యతను ప్రదర్శించాలి. శాంతి, సామరస్యంతో కూడిన భవిష్యత్తు కోసం కలిసి నిలబడదాం. భారత సైన్యం కదలికలను మీరు చూసినట్లయితే వాటిని ఫోటోలు, వీడియోలుగా తీయొద్దు. అలా చేస్తే శత్రువుకి సహాయం చేసినట్లే. ధృవీకరించబడని వార్తలను సోషల్‌మీడియాలో షేర్ చేయకండి. దానివల్ల శత్రువుకు ఉప్పందించినవాళ్లమవుతాం. ప్రశాంతంగా, అప్రమత్తంగా ఉండండి. విజయం మనదే. -రాజమౌళి

మీరు నిజమైన హీరోలు

'ఈ సమయంలో దేశాన్ని రక్షిస్తున్న సాయుధ దళాలకు ఎల్లప్పుడు రుణపడి ఉండాలి. మీరు నిజమైన హీరోలు. దేశం కోసం మీరూ, మీ కుటుంబం చేస్తున్న త్యాగాలకు హృదయపూర్వక కృతజ్ఞతలు. జైహింద్' అంటూ బాలీవుడ్ అగ్ర కథానాయిక అనుష్కశర్మ తన ఇన్‌స్టా పోస్ట్‌లో పేర్కొంది. అనుష్కశర్మ మిలటరీ కుటుంబం నుంచి వచ్చింది. ఆమె తండ్రి అజయ్ కుమార్ శర్మ ఆర్మీలో ఉన్నత స్థాయి అధికారిగా పనిచేశారు. దేశ రక్షణ, సమగ్రతకు సంబంధించిన పలు విషయాల్లో గురించి సోషల్‌మీడియా ద్వారా తన భావాల్ని పంచుకుంటుంది అనుష్క శర్మ. - అనుష్కశర్మ

ఇది అన్యాయానికి ప్రతీకారం

ఆపరేషన్ సిందూర్' రూపంలో దేశం తనకు జరిగిన అన్యాయానికి బదులు తీర్చుకుంటున్నదని అగ్ర కథానాయిక రష్మిక మందన్న వ్యాఖ్యానించింది. శాంతిని కోరుకోవడం అంటే జరిగిన నష్టాన్ని మౌనంగా అంగీకరించడం కాదని, అన్యాయానికి ప్రతీకారం తీర్చుకుంటున్న దేశాన్ని ఎవరూ ప్రశ్నించొద్దని కోరింది. 'ఉగ్రవాదం నుంచి దేశాన్ని రక్షించేందుకు చేస్తున్న పోరాటం యుద్ధం కాదు. దీనికి మద్దతు ఇచ్చేవారిని యుద్ధాన్ని కాంక్షించేవారిగా చూడొద్దు. దేశ భద్రత, సమగ్రత కోసం తపించే పౌరులు వారు. అత్యవసర ఆత్మరక్షణ నైతికంగా సరైనదే. ఉగ్రచర్యకు ప్రతీకారం తీర్చుకోవడాన్ని బాధ్యతగానే భావించాలి. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న వారిని ప్రశ్నించండి. - రష్మిక మందన్న

హ్యాట్సాఫ్ టూ ఇండియన్ ఆర్మీ

గురువారం అర్ధరాత్రి దేశమంతా నిద్రపోతున్న సమయంలో మన సైన్యం 15 భారత నగరాలను పాకిస్థాన్ దాడుల నుంచి రక్షించింది. హ్యాట్సాఫ్ ఇండియన్ ఆర్మీ. ఈ రోజు మేమంతా ప్రశాంతంగా ఊపిరి పీల్చుకుంటున్నామంటే అందుకు మీరే కారణం. శ్వాస ఉన్నంత వరకు మిమ్మల్ని గౌరవిస్తూనే ఉంటాం. మీరు ఈ పోరులో విజయులై క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటున్నా. -కాజల్ అగర్వాల్

రక్షణ సైన్యమే మనకు శ్రీరామరక్ష

పెహల్గాం దాడి జరిగిన నేపథ్యంలో నా సోదరుని నుంచి నాకు ఫోన్ వచ్చింది. అప్పుడు తను అక్కడే ఉన్నాడు. 'భయ్యా.. మనది దైవ భూమి. దైవం మన వెనకే ఉన్నాడు. ఆ వైష్ణోమాతే మనల్ని కాపాడుతుంది. మన రక్షణసైన్యమే మనకు శ్రీరామరక్ష. పాక్‌కు సంబంధించిన ఒక్క క్షిపణి కూడా మన భూమిని తాకలేదు.. తాకనివ్వరు. భారత్ మాతాకీ జై..' అన్నాడు. ఆ క్షణంలో నా తమ్ముడి మాటలు నా మనసుని గాఢంగా తాకాయి. ప్రతి భారతీయుడికీ దేశంపై మమకారం.. దైవంపై భక్తి అవసరం. తప్పకుండా ఈ యుద్ధంలో విజయం మనదే. - అనుపమ్ ఖేర్

పీవోకే ఎప్పటికైనా మనదే

శత్రువుల లక్ష్యం జమ్మూగా తెలుస్తున్నది. జమ్మూను లక్ష్యంగా చేసుకొని వారు పోరాటం సాగించనున్నట్టు సమాచారం. ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలి. సైన్యం అప్రమత్తతతో మెలగాలి. ఎప్పటికైనా పీవోకే మనదే. తుపాకీ గుళ్లకు ఎదురెళ్లి పోరాడుతున్న మన సైన్యం ధైర్య సాహసాలకు జోహార్లు.. జై భారత్.. భారత్ మాతాకీ జై.. - కంగనా రనౌత్

విజయం మనదే

దేశ పౌరుల గుండెల్లో ధైర్యాన్నీ.. శత్రు మూకల గుండెల్లో భయాన్నీ నింపేలా మన సైన్యం దూసుకుపోతున్నది. భారత సైన్యానికి దైవం మరింత శక్తినివ్వాలి. మన దేశం కనీవినీ ఎరుగని విజయాన్ని నమోదు చేయబోతున్నది. - సాయి దుర్గ తేజ్

భారత్ మాతాకీ జై..

మమ్మల్నందర్నీ కాపాడుతున్న మీకు కృతజ్ఞతలు. మీరు సురక్షితంగా ఉండండి. మీరు జాగ్రత్తగా ఉంటేనే మాకు రక్షణ. భారత్‌మాతాకీ జై..-బాలీవుడ్ నటుడు వీర్ దాస్

త్యాగాలకు విలువకట్టలేం

మన సాయుధ దళాల రక్షణకై నేనెప్పుడూ దైవాన్ని ప్రార్థిస్తూనే ఉంటాను. దేశం కోసం ప్రాణాలను సైతం పణంగా పెడుతున్న సైనికుల త్యాగాలకు విలువ కట్టలేం. ఈ యుద్ధంలో విజయం మనదే. వాళ్లు ప్రారంభించారు.. మనం ముగిస్తాం. -మంచు విష్ణు

హింసకు మూల్యం చెల్లించాల్సిందే

ఈ యుద్ధంలో మన త్రివిధ దళాలు అసమాన పోరాట పటిమను ప్రదర్శిస్తున్నాయి. మన మాతృభూమిని, దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడటానికి నిరంతర పోరాటం చేస్తున్నాయి. కులమతాలకు అతీతంగా దేశం మొత్తం ఒక్కతాటిపై నిలిచాం. ఇక హింసను భారతావని ఏ మాత్రం ఉపేక్షించదని, అందుకు మూల్యం చెల్లించాల్సిందేననే బలమైన సందేశాన్ని మన సైన్యం శత్రువులకు అందిస్తున్నది - జాన్వీకపూర్

చిత్రం

మేడ్ ఫర్ ఇండియా

సైన్యానికి విజయ్ దేవరకొండ విరాళం

నటుడిగా సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తూ సేవా, దాతృత్వ కార్యక్రమాలకు ఎప్పుడూ ముందుంటారు అగ్ర హీరో విజయ్‌దేవరకొండ. కరోనాతో పాటు వివిధ విపత్తుల సమయంలో ఆయన ఆపన్నులకు అండగా నిలిచిన విషయం తెలిసిందే. తాజాగా 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో భారత సైన్యానికి విరాళం ప్రకటించారు విజయ్ దేవరకొండ. తన క్లాత్ బ్రాండ్ రౌడీవేర్ సేల్స్‌లో వచ్చే లాభాల్లో కొంత వాటాను ఇండియన్ ఆర్మీకి విరాళంగా ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ 'మేడ్ ఇన్ ఇండియా మాత్రమే కాదు..మేడ్ ఫర్ ఇండియా' అంటూ పోస్ట్ పెట్టారు విజయ్ దేవరకొండ.

పుట్టిన రోజు సర్‌ప్రైజెస్..

విజయ్ దేవరకొండ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా సినిమాలతో బిజీగా ఉన్నారు. శుక్రవారం ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన సినిమాలకు సంబంధించిన తాజా అప్‌డేట్స్‌ను వెల్లడించారు. 'కింగ్‌డమ్' సినిమా తాలూకు పోస్టర్‌ను చిత్ర నిర్మాత సూర్యదేవర నాగవంశీ తన ట్విట్టర్ ఖాతాలో షేర్ చేసి విజయ్ దేవరకొండకు జన్మదిన శుభాకాంక్షలందజేశారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియడిక్ డ్రామా చిత్రీకరణ పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధంగా ఉంది. ఇక విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఓ చిత్రాన్ని తెరకెక్కించబోతున్న విషయం తెలిసిందే. బ్రిటీష్‌కాలం నాటి కథ ఇది. రష్మిక మందన్న కథానాయిక. శుక్రవారం స్పెషల్‌పోస్టర్‌ను విడుదల చేసిన మేకర్స్ విజయ్‌కి బర్త్‌డే విషెస్ తెలిపారు. ఈ పోస్ట్‌లో ధ్యాన ముద్రలో కనిపిస్తున్నారు విజయ్ దేవరకొండ. అగ్ర నిర్మాత దిల్‌రాజు నిర్మాణంలో రవికిరణ్ కోలా దర్శకత్వంలో విజయ్ దేవరకొండ 'రౌడీ జనార్దన్' చిత్రంలో నటించబోతున్న విషయం తెలిసిందే. రూరల్ యాక్షన్ డ్రామా ఇది. పాన్ ఇండియా స్థాయిలో నిర్మించనున్నారు. త్వరలో రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. శుక్రవారం ఈ సినిమా నుంచి కూడా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.

వసూళ్లలో కొంత భాగం సైనికుల సహాయనిధికి అందిస్తాం

'ఓవైపు మన సైనికులు దేశంకోసం పోరాడుతుంటే.. సినిమా సెలబ్రేషన్స్ చేసుకోవడం సరికాదు. అందుకే కేవలం ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పుకోడానికి మాత్రమే ఈ ప్రెస్‌మీట్ పెట్టాం. మన సైనికులకు సపోర్ట్‌గా నిలవడమే కాకుండా, ఈ సినిమాకు వచ్చే వసూళ్లలో కొంత భాగం సైనికుల సహాయనిధికి అందజేయనున్నాం.' అని అల్లు అరవింద్ తెలిపారు. ఆయన సమర్పణలో శ్రీవిష్ణు కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'సింగిల్'. కేతిక శర్మ, ఇవానా కథానాయికలు. కార్తీక్‌రాజు దర్శకుడు. విద్య కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మాతలు. శుక్రవారం సినిమా విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో అల్లు అరవింద్ మాట్లాడారు. ఇంకా చెబుతూ 'ఉద్రిక్తతల నడుమ ఈ మూవీని విడుదల చేయడం కరెక్ట్ కాదేమోనని ముందు సందేహించాం. సినిమాకోసం వందల మంది పనిచేస్తారు. థియేటర్లపై వందల కుటుంబాలు ఆధారపడి ఉంటాయి. అందుకే తప్పుగా అర్థం చేసుకోరనే నమ్మకంతో సినిమాను విడుదల చేశాం. థియేటర్లలో ఆడియన్స్ రియాక్షన్స్ చూస్తే చాలా సంతోషంగా అనిపించింది. శ్రీవిష్ణు, వెన్నెలకిశోర్ అద్భుతంగా అలరించారు. ఇద్దరు హీరోయిన్లు చక్కగా నటించారు. అందరూ మెచ్చేలా సినిమాను తీసిన దర్శకుడికి అభినందనలు.' అని అల్లు అరవింద్ అన్నారు. ఇంకా హీరో శ్రీవిష్ణు, వెన్నెల కిశోర్, డైరెక్టర్ కార్తీక్‌రాజు, కేతిక శర్మ, ఇవానా, నిర్మాత విద్య కొప్పినీడి కూడా మాట్లాడారు.

రొట్టె విరిగి నేతిలో పడిందా?

'కేజీఎఫ్' ఫ్రాంచైజీతో నటిగా దేశానికి పరిచయమైంది శ్రీనిధి శెట్టి. ఆ తర్వాత అవకాశాలు కూడా ఈ కన్నడ కస్తూరిని బాగానే వరించాయి. కానీ శ్రీనిధి మాత్రం వచ్చిన ప్రతి అవకాశాన్నీ అందిపుచ్చుకోలేదు. నచ్చిన సినిమాకు మాత్రమే గ్రీన్ సిగ్నల్ ఇస్తూ.. ప్లాన్ ప్రకారం ముందుకెళ్తున్నది. ఈ క్రమంలోనే చియాన్ విక్రమ్‌తో 'కోబ్రా' సినిమాలో నటించిందీ అందాలభామ. అయితే ఆ సినిమా తనకు చేదు అనుభవాన్నే మిగిల్చింది. అయితే.. రీసెంట్‌గా వచ్చిన 'హిట్ 3'తో మళ్లీ భారీ విజయాన్ని ఖాతాలో వేసుకున్నది శ్రీనిధి శెట్టి. ఇదిలావుంటే.. ప్రస్తుతం ఫిల్మ్ సర్కిల్స్‌లో శ్రీనిధి శెట్టికి సంబంధించిన ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటించనున్న పాన్ ఇండియా సినిమాలో కథానాయికగా శ్రీనిధి శెట్టి ఎంపికైందనేది ఈ వార్త సారాంశం. ఈ కథలో ముగ్గురు కథానాయికలకు చోటున్నదట. అందులో మెయిన్ హీరోయిన్‌గా శ్రీనిధి శెట